## నేడు తిరుపతికి గవర్నర్ హరిచందన్ రాక



తిరుపతిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త: రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న గురువారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి ఉదయం 11గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, దగ్గర్లో ఉన్న శ్రీబాలాజీ వైద్య కళాశాల, రీసెర్చ్ సెంటర్‌లో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో డిజిటల్ లైబ్రరరీ భవనానికి శంఖుస్థాపన చేస్తారు. అనంతరం తిరుమల శ్రీపద్మావతి అతిథి గృహం చేరుకుని విశ్రాంతి తీసుకుంటారని తెలిపారు. అనంతరం 3:20 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుని, సాయంత్రం 5:10గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని గన్నవరం విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ తెలిపారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త







ధనుర్మాసం సందర్భంగా కపిలేశ్వర ఆలయంలో స్వామివారి తెప్పోత్సవాల్లో నాల్గవరోజు సాయంత్రం కామాక్షిఅమ్మవారి అలంకారంలో స్వామివారు

# కుప్పంలో ఉద్రిక్తత

**చంద్రబాబును అడ్డుకున్న పోలీసులు - నోటీసులు అందజేత.. తెదేపా కార్యకర్తలపై లాఠీచార్జ్.. సైకో సిఎం అంటూ నినాదాలు !!**





ప్రతిపక్ష నేత చంద్రబాబుకు నోటీసులు ఇస్తున్న డిఎస్పీ సుధాకర్‌రెడ్డి  కుప్పంలో తెదేపా కార్యకర్తలపై లాఠీచార్జ్ దృశ్యం

శాంతిపురం, జనవరి 4 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన తీవ్ర ఉద్రిక్తంగా మారింది. బుధవారం సాయంత్రం 4గంటలకు శాంతిపురం మండలం 121 పెద్దూరుకు చంద్రబాబునాయుడు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి చంద్రబాబునాయుడుకు నోటీసులు అందించే యత్నం చేశారు. పర్యటనకు సంబంధించి అనుమతులు పొందలేదని డిఎస్పీ చంద్రబాబుతో పేర్కొన్నారు. దీనిపై చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గతంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని, ఎన్నో జిఓలు చూశానని అసలు తానెందుకు నోటీసులు తీసుకోవాలని ప్రశ్నించారు. కొత్త జిఒలతో తనను అడ్డుకునేయత్నాలు చేసే యత్నాలు మానుకోవాలన్నారు. ఓదశలో చంద్రబాబు తీవ్ర ఆగ్రహంకు లోనయ్యారు. అనంతరం కొంతసమయం కారులోనే కూర్చుండిపోయారు. ఈదశలో అక్కడకు చేరుకున్న తెదేపా కార్యకర్తలు పెద్ద ఎత్తున సైకో సిఎం అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు మండలంలోని ఎస్.గొల్లపల్లి వద్ద తెదేపా శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఓ మహిళా కార్యకర్తతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంతకుముందు గడ్డూరులో సైతం దేశం శ్రేణులను పోలీసులు అడ్డుకోగా తెదేపా శ్రేణులు రోడ్డు పక్కన ఉన్న బారికేడ్లను పక్కకు తీసి పడేశారు. ఉదయమే కుప్పంలో ఉన్న చంద్రబాబు ప్రచార రథాన్ని, మైక్ వాహనంను పోలీసులు అనుమతి లేదని గుడుపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే కెనమాకులపల్లిలో రచ్చబండ కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన వేదికను పోలీసులు తొలగించారు. కాగా సాయంత్రం 6.30గంటలకు కూడా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 121 పెద్దూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈసందర్భంగా మహిళలు చంద్రబాబుకు పెద్ద ఎత్తున మంగళహారతులు పట్టి ఘనస్వాగతం పలికారు.

### ప్రజల్ని పలకరిస్తూ.. మమేకమవుతూ !!

పోలీసుల ఆంక్షల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి రోడ్‌షోలు, సభలకు అనుమతులు లేకపోవడంతో గ్రామాల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రజల ఇళ్ల వద్దకెళ్లి వారిని పలకరిస్తూ వారితో మమేకమవుతూ పర్యటించారు. బుధవారం రాత్రి బెండనకుప్పం, చెంగుబళ్లలో చంద్రబాబు పర్యటించారు. చెంగుబళ్లలో మాజీ సర్పంచ్ గోపాల్ నివాసానికి వెళ్లారు. అనంతరం శివకురుబూరులో ఉన్న ఆలయంకు వెళ్లగా వేదపండితులు ఆశీర్వదించారు. శాంతిపురంలో తెదేపా నేత ఎన్‌డి నాయుడు నివాసంకు వెళ్లి నూతన వధూవరులను చంద్రబాబు ఆశీర్వదించారు. గ్రామాల్లో చంద్రబాబును చూసేందుకు జనం ఎదురుచూడడం కన్పించింది.

### పోలీసులు వర్సెస్ తెదేపా కార్యకర్తలు

గుడుపల్లె : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా పోలీసులు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. చంద్రబాబు పర్యటనకు అనుమతులు లేవని పోలీసులు శాంతిపురం మండలంలో ఎక్కడికక్కడ తెదేపా శ్రేణులను నిలువరించేయత్నం చేశారు. దీంతో వారు పోలీసుల తీరుకు ఆగ్రహించారు. గడ్డూరులో పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను పక్కకు తీసి పడేశారు. ఓ దశలో పోలీసులు, నేతలు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

### మరలా అధికారంలోకి వస్తా..

## చిత్రగుప్తుడిలా లెక్కలు తేల్చుతా

**ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు**



శాంతిపురం, జనవరి 4 ప్రభాతవార్త

మరలా తాను ముఖ్యమంత్రిగా అధికారంలో రావడం ఖాయమని వైకాపా నేతల లెక్కలు చిత్రగుప్తుడిలా తేల్చుతానని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం రాత్రి కెనమాకులపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం వద్ద ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సిఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముప్పై ఏళ్లు వెనక్కు నెట్టేశారని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. సిఎం జగన్‌రెడ్డి ఆస్తులు 381కోట్లు దేశంలో ఏ ముఖ్యమంత్రికి లేవన్నారు. రాష్ట్రంలో తెదేపాకు లభిస్తున్న ఆదరణ తట్టుకోలేక సిఎం జగన్‌రెడ్డి తన పర్యటనలను అడ్డుకుంటున్నారని అయితే ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. కుప్పంలో కర్ణాటక మద్యాన్ని వైకాపా నేతలు డోర్ డెలివరీ చేస్తున్నారని రాష్ట్రంలో నాసిరకం మద్యం విక్రయాలు సాగుతున్నాయన్నారు. సిఎం జగన్‌రెడ్డి ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. మహిళలను అవమానించడం, దాడులు చేస్తున్నారన్నారు. గత కుప్పం పర్యటనలో 81మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి పదిమందిని జైలులో పెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో కుప్పంలో వన్‌సైడ్ పోలింగ్ జరగాలన్నారు. పుంగనూరు పుడింగి కుప్పంలో ఉన్న గ్రానైట్ సంపదను కొల్లగొట్టారని ఆయన కథ తేల్చుతానన్నారు. అంతకుముందు సర్పంచ్ అభ్యర్థి శివ నివాసానికి చంద్రబాబు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, జయరాం రెడ్డి, నాగరాజు, రాధాకృష్ణ, కోదండప్ప, మణిలు పాల్గొన్నారు.

# ఎన్నడూ లేని విధంగా పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి

**మంత్రి పెద్దిరెడ్డి**



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల, జనవరి 4 ప్రభాతవార్త

గతంలో ఎన్నడూలేని విధంగా పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అభివృద్ది జరుగుతోందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం సోమల మండలంలోని శీలయ్యగారిపల్లె, 81 చిన్నపుప్పరపల్లె, ఎస్.నడింపల్లె పంచాయతీలలో ఆయన పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రూ. 8.5లక్షల చొప్పున వ్యయంతో సవరంవారిపల్లె, చిన్నఉప్పరపల్లెల్లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఆయనప్రారంభించారు. అదేవిధంగారూ. 5లక్షల వ్యయంతో పొదలకుంటపల్లె, దిడ్డివారిపల్లెల్లో నిర్మించిన ఆర్వో ప్లాంట్లను ,రూ. 21.8లక్షలతో ఎస్.నడింపల్లె, దిడ్డివారిపల్లెలో నిర్మించిన రైతు బరోసా కేంద్రాలనుఅదేవిధంగా రూ. 40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 60లక్షలతో నిర్మించిన మీటింగ్ హాల్‌లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చెరువులకు నీరు నింపేలా ఆవులపల్లె వద్ద రిజర్వాయరును నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తూఇంటింటకి కొళాయల ద్వారా సురక్షితమైన నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. లబ్దిదారులకు కొత్తపించన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా నంజంపేటలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళల అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ కొండవీటి నాగబూషణం, జడ్పీ సీఈఓప్రభాకరరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, బోయకొండ ఆలయ ఛైర్మెన్ మిద్దింటి శంకరనారాయణ, ఎంపీడీఓ నాగరాజు, జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఎమ్మార్సీ రెడ్డి, ఎంపిటీసీ నాగబూషణరెడ్డి, అమాసమోహన్, నాగేశ్వరరావు, సర్పంచి వెంకటరెడ్డి, మాజీఎంపీపీ ఝాన్సి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో చంద్రబాబు తీరు ఆక్షేపణీయం

**- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



కుప్పంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు పర్యటనలో ప్రవర్తించిన తీరు ఆక్షేపణీయంగా వుందని రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమల మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు కుప్పంలో తన మనుగడ కాపాడుకోవడం కోసం ప్రస్తుతం ప్రవర్తిస్తున్న తీరు సిగ్గుచేటుగా వుందన్నారు. చంద్రబాబునాయుడు తన నియోజకవర్గంలో పర్యటించిన తీరు ఎలా వుందంటే ఒక వీధి రౌడీ ప్రవర్తించిన తరహాలో వుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఉత్తర్వులు ప్రతిపక్ష పార్టీలు, ప్రత్యర్థులకే కాకుండా ప్రభుత్వంలో వున్న తమకు సైతం వర్తిస్తుందన్నారు. జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ట్విట్టర్‌లో రాష్ట్రం జగన్మోహన్‌రెడ్డి జాగీరా! అని ప్రశ్నించారని, జాగీరు తనం, రాజరికం పోయిందని ప్రస్తుత ప్రజాస్వామ్య పాలన నడుస్తోందని రాజులు, రాజ్యాలు ఇప్పుడు లేవన్నారు. ప్రభుత్వం తెచ్చిన జిఒను గౌరవించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

### డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో

# ఏసీబి దాడులు

**రూ.1.70 కోట్ల అక్రమ ఆస్తులు సీజ్**





డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో దాడులు చేస్తున్న ఏసీబీ అధికారులు , స్వాధీనం చేసుకున్న వస్తువులు

తిరుపతి క్రైం, జవనరి 4, ప్రభాతవార్త

తిరుపతి సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. యుగంధర్ నివాసం తిరుపతి రూరల్ రెవెన్యూ కాలనీలో ఏసిబి దాడులు చేపట్టారు. ఏసిబి డిఎస్పి జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో, కర్నూల్ ఏసిబి డిఎస్పి శివ నారాయణ స్వామి తన బృందంతో సోదాలు చేపట్టారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యుగంధర్ అవినీతి పనులకు పాల్పడి ఆదాయానికి మించిన ఆస్తులు కూడా పెట్టాడని ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఆస్తులు కాకినాడలో 2 అంతస్తుల మిద్దె ఇల్లులు 2, కాకినాడలో ఒక అపార్ట్మెంట్, విజయవాడలో అపార్ట్మెంట్, కాకినాడలో ఐదు ఇళ్ల స్థలాలు, విజయవాడలో ఒక ఇల్లు, ఈస్ట్ గోదావరిలో మూడు స్థలాలు, కాకినాడ ప్రాంతంలో వ్యవసాయ భూములు 3.5 లక్షల నగదు, 850 గ్రాములు బంగారం, 3.5 కేజీ వెండి, నాలుగు చక్రాల వాహనం, అక్రమంగా సంపాదించినట్లు దర్యాప్తులో తేలింది. కాకినాడ, విజయవాడ పరిసర ప్రాంతాలలో తన బంధువులపై ఆస్తులు వున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని డిఎస్‌పి తెలిపారు.

## ప్రతి నెల 1న పెన్షన్ పంపిణీ

**- మంత్రి రోజా**



నగరి, జనవరి 4 ప్రభాతవార్త:

జగనన్న ప్రభుత్వంలోనే ప్రతి నెల 1వ తేదీనే తలుపు తట్టి పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు మంత్రి రోజా తెలిపారు. నగరిలో బుధవారం జరిగిన నగరి మండల, మున్సిపల్ వైఎస్ఆర్‌పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికి పెన్షన్‌లు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు టిక్ పెడితేనే పెన్షన్‌లు ఇతర కార్యక్రమాలు చేయడం జరిగిందని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గౌరవంగా ఎవరైతే పెన్షన్‌కు అర్హులో మీ ఇంటికి వలంటీర్లు వచ్చి డిటైల్స్ అప్‌లోడ్ చేసి 1వ తేదీనే తలుపు తట్టి పెన్షన్ ఇస్తున్నారని వివరించారు. మహాత్మగాంధీ కోరుకున్నట్లు గ్రామ స్వారాజ్యాన్ని ప్రజల వద్దకే పరిపాలన రావాలని ప్రజల కష్టాలను వారి ఇంటి వద్దనే పరిష్కరించాలని గొప్ప ఆలోచనతో సచివాలయ వ్యవస్థను తీసుకురావడమే కాకుండా ప్రతి 50 ఇళ్ళకు వలంటీర్లను పెట్టారని తెలిపారు. పెన్షన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే కాని, కొత్త వారికి మంజూరు చేసే వారు కాదని నేడు అర్హులందరికి పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో, తహసీల్దార్ తదితర మండల అధికారులు పాల్గొన్నారు.

## సంక్రాంతి నుండి స్పందన సేవలు మరింత పెంపు

**- కలెక్టర్ హరినారాయణన్**

చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త:

స్పందన కార్యక్రమం అర్జీల పరిష్కారం మరింత పారదర్శకంగా నిర్వహించడానికి సంక్రాంతి పండుగ నుండి 'జగనన్నకు చెబుతాం' కార్యక్రమంకు శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్‌ఓ రాజశేఖర్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుడు ఎలాంటి సమస్యతో కార్యాలయానికి వచ్చినా అతనితో మర్యాదగా ప్రవర్తించి అతని సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ స్థాయి నుండి సమస్యలను అప్‌లోడ్ చేయాలని, ఆయా శాఖల వారు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఆడిట్ బృందం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంక్రాంతి నుండి పిటీషనర్లు 1902 ద్వారా రికార్డు చేసుకోవచ్చునని ఇది సిఎంఓ కార్యాలయం ఆధ్వర్యంలో పని చేస్తోందన్నారు. జిల్లా స్థాయిలో ఈ సేవ సర్వీసుల కోసం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సిపిఓ ఉమాదేవి, డిసిఓ బ్రహ్మానందరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, సెరికల్చర్ జెడి శోభారాణి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి దుర్గాభవాని, ఎపిఎస్‌డిసిఎల్ ఎస్ఇ శ్రీహరి, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి రబ్బానీభాషా, బీసీ కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మీ, ఇరిగేషన్ ఎస్ఇ విజయకుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వెంకట్రావ్, మైన్స్ డిడి ప్రసాద్, డిఇఓ విజయేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉష్ణోగ్రతలు

4/1/2023



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

### బంగారం ధరలు

4/1/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 238

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,714

### కోడిగ్రుడ్ల ధరలు

4/1/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## నగర అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ అజెండా : మేయర్ శిరీష



తిరుపతి కార్పొరేషన్, జనవరి 4, ప్రభాతవార్త

నగర అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ అజెండా రూపొందించాలని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధికారులను ఆదేశించారు. బుధవారం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ అనుపమ అంజలి, ఉప మేయర్లు అభినయ రెడ్డి, ముద్ర నారాయణ, అన్ని విభాగాల అధికారులతో ప్రీ కౌన్సిల్ మీట్ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనుల పురోగతి, ప్రజాభివృద్ధికై చేయాల్సిన పనులపై చర్చించారు. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఏ పనులు అవసరమో అవి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగానే నగరంలో 13 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం మరింత వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఎస్‌కె. బాబు, రామస్వామి, వెంకటేష్, నరసింహాచారి, ఉమా అజయ్, గణేష్, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఓ మోహన్, కార్యదర్శి రాధిక, వెంకట్రామిరెడ్డి, డిసిపి దేవకి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఆర్ఓలు సేతుమాధవ్, కెఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, ఏసిపిలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం తదితరులు ఉన్నారు.

### కాణిపాకం ఆలయంలో...

## ఇద్దరు అర్చకులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సస్పెన్షన్

కాణిపాకం, జనవరి 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం స్వామివారికి జరిగే ప్రత్యేక అభిషేకంను నిర్వహించకుండా ఆలయ అర్చకులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటనపై ఆలయ ఉప ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లను బాధ్యులను చేస్తూ వారిపై ఆలయ అధికారులు సస్పెన్షన్ వేటు వేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం ప్రధాన ఆలయంకు ఉప ఆలయంగా శ్రీవీరాంజనేయస్వామి వారి ఆలయం వుంది. ఈఆలయంలో ఒక ఉప ప్రధాన అర్చకులు, ఒక ముఖ్య అర్చకులు, ఒక పరిచారిక అర్చకులు షిఫ్టుల వారిగా ఉదయం నుండి రాత్రి వరకు విధులు నిర్వహిస్తుంటారు. ఈనేపథ్యంలో ఆలయంలో పనిచేసే ముఖ్య అర్చకుడు, పరిచారిక అర్చకుడు ప్రతి మంగళవారం ఆలయంలో స్వామివారికి ఉదయం 6 నుండి 7 గంటల మధ్య నిర్వహించే ప్రత్యేక అభిషేకంను ఉద్దేశ్యపూర్వకంగా నిర్వహించకుండా నిలిపివేసి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించి శాస్త్రోక్తంగా జరుగ వలసిన నిత్య కైంకర్యములలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఆలయ అధికారులు గతనెల 20 ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు, ముఖ్య అర్చకులు వి.హరీష్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లతో పాటు ఆలయ ఏఈఓ, సూపరెండెంట్‌లకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ఈమేరకు వారి నుండి సంజాయిషీ తీసుకున్న అనంతరం ఆలయంలో ప్రతిరోజూ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలలో భాగంగా ప్రతి మంగళవారం ఉదయం 5.30 గంటలకు స్వామివారికి జరిగే ప్రత్యేక అభిషేకంను ఈనెల 13న నిర్వహించకుండా ఆలయ అర్చకులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించారని నిర్ధారిస్తూ ఈముగ్గురిని తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ ఉత్వర్తులు జారీ చేశారు. ఆలయ అధికారుల అనుమతి లేకుండా విధుల సమయాలలో మార్పులు చేసుకుంటూ, ఉప ప్రధాన అర్చకులుగా వుంటూ తోటి అర్చకులకు ఆదర్శముగా వుండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆలయ ఉప ప్రధాన అర్చకులను విధుల నుండి సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అలాగే ఆలయంలో విధులకు గైర్హాజరై అభిషేకం నిర్వహించకపోగా ఆలయ అధికారులపై దుష్ప్రచారం చేశారనే ఆరోపణలపై ఉప ప్రధాన అర్చకులు హారీష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆలయ వ్యవహారాలను నిత్యం పర్యవేక్షిస్తూ అర్చకులు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌ను సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఆలరు నెలలుగా ఆలయంలో వరుస వివాదాలు చోటు చేసుకుంటుండడంతో భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయి.

# ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ల మొత్తం పెంపు - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త:
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ల మొత్తంను పెంచి ఇస్తున్నారని, ఇది వరకు లబ్దిదారులకు రూ.2,500 పెన్షన్ చెల్లిస్తే ప్రస్తుతం రూ.250 పెంచి రూ.2,750 చెల్లింపులు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. పెన్షన్ వారోత్స వాలను పురస్కరించుకొని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇప్పటికే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 95 శాతం మేరకు పూర్తి చేశారన్నారు. కుల, మత, వర్గ విబేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎవరి సిఫార్సులు నిమిత్తం లేకుండా సంక్షేమ ఫలాలు



అందించడం ఒక్క సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి కొంతమందికి పెన్షన్లు నిలిచాయని, వీటిని పునరుద్దరించడానికి సిఎం, మంత్రులు ఆలోచనలు చేస్తున్నారన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పెన్షన్లను అందిస్తోందన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా 506 మందికి పెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు. అర్హులైన వారు సరైన పత్రాలతో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని లబ్దిదారులకు వైఎస్ఆర్ పెన్షన్ మొత్తం రూ.4.88 కోట్ల రూపాయల మెగా చెక్కును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు, సిఎంఎం గోపి, నగర పాలక సంస్థ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు-మన ప్రభుత్వం

ఐరాల, జనవరి 4 ప్రభాతవార్త:
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం మండలంలోని వేదగిరివారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని గుట్టపాళ్యం, సింగంశెట్టి వారిపల్లె, వేదగిరివారిపల్లె తదితర గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య, నాయకులు సురేష్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అవ్వతాతల ఆనందమే జగనన్న లక్ష్యం

బంగారుపాళ్యం, జనవరి 4 ప్రభాతవార్త:
అవ్వతాతల కళ్ళల్లో ఆనందం చూడటమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం సాయంత్రం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా పెన్షన్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి లబ్ది చేకూరేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ అసరా పెన్షన్ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి నెలా అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల వర్గాలకు ప్రభుత్వం పెన్షన్లను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బెన్నురాజ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, గ్రామ కార్యదర్శులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్

గుడిపాల, జనవరి 4 ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని నరహరిపేట జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డిఇఓ విజయేంద్రరావులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షల నిర్వహణ తీరును వారు పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించివారినుండిపలుప్రశ్నలకుసమాధానాలురాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల లో ఇంటర్మీడియేట్ పిఇటి సిబ్బంది కొరత వుందని సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరగా సత్వరం ఏర్పాటు చేయాలని డిఇఓ విజయేంద్రరావును ట్రైనీ కలెక్టర్ ఆదేశించారు. ఎంఇఓ రామ్‌నాయక్, హెడ్మాస్టర్ సబర్మతి పాల్గొన్నారు.

## శరవేగంగా తుడా పనులు



భాకరాపేట, జనవరి 4 ప్రభాతవార్త
మండలంలో తుడా పనులు శరవేగంగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ డీఈఈ ప్రభాకరరెడ్డి అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేచెవిరెడ్డి భాస్కంరెడ్డి తుడా పరిదిలోని గ్రామాలనుఅభివృద్ధి పథంలో నడపడానికి ప్రతి మండలంలో జగనన్న సమావేశ మందిరాలు, రచ్చబండలు,సిమెంటు రోడ్లు,పార్కులు, స్మశానవాటికలు,నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని దృఢ సంకల్పంతోఉన్నారన్నారు. చిన్నగొట్టిగల్లు మండల కార్యాలయ ఆవరనలోని సమావేశ మందిరాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలోఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, తహశీల్దారు హనుమాన్‌నాయక్, పంచాయతీరాజ్ ఏఈ రాజాజీ,సర్పంచిలు మాధవి, మునురామ్, పార్టీ నాయకులు అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.30లక్షలతో మురుకినీటి కాలువల నిర్మాణం

రొంపిచెర్ల,జనవరి4 ప్రభాతవార్త



మండల పరిదిలోని తహశీల్దారు కార్యాలయం ఎదుట రూ.30లక్షలతో మురుకినీటి కాలువను నిర్మిస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి తెలిపారు. బుధవారం ఈ కాలువ నిర్మాణపనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గత నాలుగునెలల క్రితం కురిసినవర్షాలకు నీరు తహశీల్దారు కార్యాలయంలోకిచేరిందన్నారు. దీనితో కాలువ నిర్మానానికి, రెండు కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ఇది తెలుసుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.30లక్షలు జడ్పీ నిధులుమంజూరు చేయించారన్నారు. అదేవిధంగా తహశీల్దారుకార్యాలయం చుట్టూ ప్రహరీనిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలోతహశీల్దారు మురాషావలి, వైస్ఎంపీపీవిజయశేఖర్, డీటీవెంకటరమణారెడ్డి, సర్వేయర సులోచన, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు - మేయర్ అముద

చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త:
అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని మేయర్ అముద పేర్కొన్నారు. 39వ డివిజన్ పరిధిలో బుధవారం పెంచిన వైఎస్ఆర్ సామాజిక పెన్షన్లను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం అత్యధిక మంది అర్హులకు సామాజిక పెన్షన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రస్తుతం పెంచి అందిస్తున్న సామాజిక పెన్షన్లతో లబ్ధిదారుల ముఖంలో సంతోషం కన్పిస్తోందన్నారు. ఈ

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాధితులకు ఆర్థిక సాయం

చౌడేపల్లి, జనవరి 4 ప్రభాతవార్త



ఇటీవల తెల్లనీళ్ళపల్లిలో జరిగిన ఘర్షణలో గాయపడ్డ ఇద్దరికి ఆర్థిక సాయమందించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిటీసీ తొండ శ్రీరాములు, సర్పంచు భాగ్యవతి భర్త హరిప్రసాద్‌లకు రూ. 50వేల చొప్పున అందించారు. రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, పాల ఏకిరిల కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డురమణ, సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, జంగాలపల్లి రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంనాడు బలోపేతానికి గ్రామకమిటీలు : శివ

చౌడేపల్లి, జనవరి 4 ప్రభాతవార్త
మాలమహానాడు బలోపేతానికి మండల వ్యాప్తంగా గ్రామకమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసంఘ జిలాన్ల ఉపాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఈమేరకు పంచాయతీ కేంద్రం పెద్దయల్లకుంట్లలో ఎంఎంనాడు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. . నాయకులు సుబ్రమణ్యం, ముకుంద, రాజేంద్ర, కూరపర్తి ఈశ్వర్, కొత్తపల్లి మణి, నాని, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల ఆశాజ్యోతి లూయిా బ్రేయిలీ : హెచ్ఎం వరప్రసాద్

వెదురుకుప్పం, జవనరి 4 ప్రభాతవార్త :



అంధుల ఆశాజ్యోతని లూయిా బ్రెయిల్ అని వారి జీవితాలలో వెలుగులు నింపిన ఘనత బ్రెయిల్‌కు దక్కుతుందని పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పచ్చికాపల్లంలోగల భవిత కేంద్రంలో బ్రెయిల్ జన్మదినం పురష్కరించుకుని ప్రపంచ అంధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిల్ అంధుడైన అంధుల జీవితాలలో వెలుగు రేఖలు నింపాలని విశేషంగా కృషి చేసి ఆరు చుక్కలతో ఒక లిపిని తయారు చేశారని, దీంతో ప్రపంచంలోని అంధులందరు వారి మునివ్రేలతో స్పర్శించి చదవడం, ఆ లిపిలో రాయడం చేయగల్గుతున్నారని, ఆ ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్, ఐఇడిఎస్ఎస్ టీచర్ రాజశేఖర్, సహిత విద్యా ఉపాధ్యాయులు శ్యామల, గుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి: జడ్పీ సీఈఓ

సదుం,జనవరి 4 ప్రభాతవార్త



సచివాలయాలలో పనిచేసే ఉద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు కలిసి గ్రామాలలో తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డిఅన్నారు. బుధవారం సదుం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద చేపడుతున్న సర్వేని తొందరగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణప్రాంతాలలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిదంగా సచివాలయాలలో సిబ్బంది ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. వచ్చిన సమస్యలను ఆన్‌లైన్ చేసిపరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దారు చంద్రశేఖర్, వైద్యులు శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పులిచెర్లలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌ఎంట్‌స్టేషన్ ప్రారంభం

కల్లూరు,జనవరి 4 ప్రభాతవార్త



పులిచెర్లలో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషనును జిల్లా అసిస్టెంటు కమీషనర్ మధుమో హన్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిదిలో నాటు సారా తయారీ, ఇసుక అక్రమ రవానాను అరికట్టేందుకుఅన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి రాణి, ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌నాయుడు, సీఐ శ్రీరాములు, ఎస్సై మస్తాన్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బాబు

తవణంపల్లె, జనవరి 4 ప్రభాతవార్త:
పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలో నూతనంగా మంజూరైన వివిధ రకాల పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే మండలంలో లబ్ధిదారులకు పెంచిన పింఛన్ల మొత్తంను 9614 మందికి 2.53 కోట్లు రూపాయల మెగా చెక్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు



ఈనెల నుండి వివిధ రకాల పింఛన్‌దారులకు 2,750 రూపాయలు పెంచి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గీత, జడ్పీటీసీ భారతి మధుకుమార్, వైస్ ఎంపీపీలు పట్నం ప్రతాప్‌రెడ్డి, శోభా, తహశీల్దార్ సుశీల, ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డిలతో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రజలకు సేవలు అందించడంలో వైసీపీకి సాటిలేదు

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



దొరవారిసత్రం, జనవరి 4 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రజలకు సేవలు అందించడంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సాటిలేదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు 95 శాతానికి పైగా అమలు చేసి దేశం గర్వించే విధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఉద్యానశాఖ, విద్యుత్‌శాఖ, ఐసిడిఎస్ శాఖల పనితీరు సక్రమంగా లేదని సర్పంచులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. వెంటనే వాటిని సరిదిద్దాలని లేకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే సంజీవయ్య సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపిడిఓ శింగయ్య, నాయుడుపేట సిఐ వైవి సోమయ్య, సర్పంచులు మధురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త
అంధుల ఆరాధ్యదైవం డాక్టర్ లుయిలీ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకొని సూళ్లూరుపేటలోని భవిత స్కూలులో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమానికి ఎన్‌పిఆర్‌డి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకారంచుట్టారు. ఇందులో భాగంగా అంధులు, దివ్యాంగులు, మానసిక వైకల్యం గల వారికి దుప్పట్లు పంపిణీచేసి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డి సంస్థ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి మాట్లాడుతూఅర్హులైన దివ్యాంగులు అందరికీ సదరన్ క్యాంప్ ఏర్పాటు చేసి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. హరిబాబు, భానుప్రసాద్, వెంకటస్వామి, సూర్యకుమారి, కె. ఉషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో సీపీఐ నిరసన



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జీవో ద్వారా ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని వారు పేర్కొన్నారు. 1861 బ్రిటీష్ కాలంలో పోలీసు శాఖవారు జారీ చేసిన ఈ జీవోను తిరిగి ప్రస్తుతం వెలుపలికి తీసి ఆంధ్ర రాష్ట్రంలో ప్రవేశపెట్టడం సమంజసంగా లేదన్నారు. ఈ చీకటి జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులుఎ.ఆనంద్‌బాబు, ఎ.బాలయ్య, అశోక్‌బాబు, అనిల్, కాలేషా, బాలు తదితరులు పాల్గొన్నారు.

## నెలబల్లిలో లూయిస్ బ్రెయిలీ దినోత్సవం



దొరవారిసత్రం, జనవరి 4 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలం నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారంఎంఇఓఆధ్వర్యంలోలూయిస్‌బ్రెయిలీదినోత్సవంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మస్తానయ్య మాట్లాడుతూ ప్రాచీన జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు లూయిస్ బ్రెయిలీ అన్నారు. ఆయన ఎంతోమంది అంధులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపి లూయిస్ బ్రెయిలీ అందరి మన్ననలు పొందారని, అలాంటి వ్యక్తి చేసిన సేవలు అందరు గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం అంధ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీరితోపాటుసభ్యులువాసవి, కరుణాకర్, రమణయ్య, భారతి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

## ఎంఎంసి ఛైర్మన్‌గా తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి నియామకం

నాయుడుపేట, జనవరి 4 ప్రభాతవార్త
నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్మన్‌గా తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డికి పదవి దక్కడంతో సందడి వాతావరణం నెలకొంది. నాయుడుపేట నాయుడుపేట మండలం బిరదవాడకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడైన తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి నివాసానికి బుధవారం ఆ పార్టీ నాయకులు చేరుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి దక్కడానికి సహకరించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, యువ నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, పొట్లపూడి రాజేష్, లాయర్ కుమార్, పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కటకం జయరామయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, అశోక్, బంగారుబాబు, షేక్ షబ్బీర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు



ఓజిలి, జనవరి 4 ప్రభాతవార్త
ఓజిలి మండలం ఆరిమేనుపాడు, ఓజిలి, రాచపాలెం గ్రామాల్లో గురువారం నుంచి నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు కోరారు. ఆయన బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ మూడున్నరేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

## అక్రమ మద్యం కేసులు వ్యక్తికి మూడు నెలలు జైలు శిక్ష

వాకాడు, జనవరి 4, ప్రభాతవార్త
విద్యా నగర్ గ్రామంలోని మద్యం విక్రయిస్తూ సెబ్ పోలీసులకు పట్టు పడడంతో కేసు నమోదు చేసి 19.03.2021 రిమాండ్‌కు తరలించారు. కోట మెజిస్ట్రేట్ సిహెచ్ భరత్ కుమల్ బుధవారం ముద్దాయికి మూడు నెలలు జైలు శిక్ష, 5000 రూపాయిలు జరిమాన విధించినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న లక్ష్మి తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై ఆర్డీవోతో చర్చించిన రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి, జనవరి 4, ప్రభాతవార్త:



నియోజకవర్గ అభివృద్ధి పనులపై గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌తో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సన్నిహితులు చర్చించారు. రాంకుమార్‌రెడ్డి సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో ఆర్డీవో తహసీల్దారు శ్రీనివాసులు, కమిషనర్ గంగాప్రసాద్ తదితర శాఖల అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. జగనన్న లేఅవుట్‌లో నిర్మితమవుతున్న గృహాల నిర్మాణ పనులు, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి భూసేకరణ తదితర అంశాలపై ఆర్డీవోతో చర్చించారు. భూ సమస్యల పరిష్కారంపై కూడా చర్చించారు. మున్సిపాలిటీలో 25 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నందు వలన అందరిని సమన్వయం చేయాలని కమిషనర్ గంగాప్రసాద్‌కు తెలిపారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు. తహసీల్దారు శ్రీనివాసరావు, ఇన్స్‌పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి నియోజకవర్గంలో ముగ్గుల పోటీలు

వెంకటగిరి, జనవరి 4, ప్రభాతవార్త:
ఈ నెల 6వ తేదీ నుంచి వెంకటగిరి నియోజకవర్గంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్‌నాయుడు తెలిపారు. బుధవవారం వెంకటగిరిలోని విశ్వ విద్యాలయ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో తేదీ వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు తగు బహుమతులు అందజేస్తామని వివరించారు. ముగ్గుల పోటీల్లో విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా పింఛన్లు పంపిణీ

కోట, జనవరి 4 ప్రభాతవార్త



రాష్ట్రంలో అర్హత ఉన్న పేదలందరికీ ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు అందజేయడం జరుగుతుందని, ప్రభుత్వం అందించే ఏ పథకానికైనా అర్హతనే ప్రామాణికంగా తీసుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు చెప్పారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో పింఛన్ల పెంపు వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి అండగా ఉండేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. అనంతరం వైసీపీ తిరుపతి మైనార్టీసెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఇన్ని పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, చిట్టేడు మాజీ సర్పంచ్ రఘురామయ్య, సుధారెడ్డి, గురుస్వామి, జగదీష్, వలిపి శ్రీనివాసులు, ఎంపిటిసి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**ఆలస్యంగా ప్రారంభమైన కార్యక్రమం** ఉదయం 12 గంటలకు ప్రారంభం కావాల్సిన పింఛన్ల వారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరప్రసాదరావు 1 గంటకు రావడంతో వితంతువులు, అవ్వాతాతలు, షుగర్ పేషంట్లు, బీపీ ఉన్నవారు ఎంతో ఇబ్బందులకు గురయ్యారు.

## నిందితుడికి మూడునెలలు జైలుశిక్ష

కోట, జనవరి 4 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విజయశేఖర్ అనే వ్యక్తిపై ఎక్సైజ్ పోలీసులు 2021లో దాడులు చేసి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ తీర్పు చెప్పారు. నిందితుడు శేఖర్‌కు మూడు నెలలు జైలు శిక్షతో పాటు, ఐదువేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సిఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

## ఆనందంలో నేదురుమల్లి వర్గం

కోట, జనవరి 4 ప్రభాతవార్త
దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గానికి సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించడంపై గూడూరు డివిజన్‌లోని నేదురుమల్లి వర్గంలో ఆనందం వెల్లివిరుస్తోంది. తొలి నుంచి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీకి విధేయుడిగా, క్రమశిక్షణతో పార్టీ అధిష్టానం ఏ బాధ్యతలు అప్పగించినా నిజాయితీగా సమర్ధవంతంగా నిర్వర్తించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ క్రమంలో ఆయన పనితీరు పట్ల పార్టీ అధిష్టానం గుర్తించి వెంకటగిరి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించడం పట్ల నేదురుమల్లి వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆ మేరకు కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెంలో నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, ఇటు విద్యానగర్‌లో సర్పంచ్, వైసీపీ నాయకులు దేవారెడ్డి నాగూర్‌రెడ్డి పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి రామ్‌కుమార్‌రెడ్డికి టిక్కెట్ క్లియర్ అయినట్లే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## నెలవలకు సన్మానం



పెళ్లకూరు, జనవరి 4 ప్రభాతవార్త
సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నెలవల సుబ్రహ్మణ్యంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి షిరిడీ సాయిబాబా వారి తీర్థప్రసాదాలు అందజేశారు. నెలవలను కలిసిన వారిలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జ్, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేందర్‌రెడ్డి, పార్లమెంట్ రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, చింతపూడి సర్పంచ్ కల్పకోలు, మాజీ ఎఎంసి డైరెక్టర్, సీనియర్ టీడీపీ నాయకులు దామోదర్‌ప్రసాద్‌నాయుడు తదితరులు ఉన్నారు.

## బీమా నగదు అందజేత

ఓజిలి, జనవరి 4 ప్రభాతవార్త
ఓజిలి మండలం కురుగొండ గిరిజన కాలనీలోని కుడుముల శివయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో కోటమ్మకు వైఎస్సార్ బీమా నగదు పది వేల రూపాయలను బుధవారం కురుగొండ సర్పంచ్ తిరుమలశెట్టి శ్రీలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వాలంటీర్లు ఉన్నారు.

## ఘనంగా లూయిస్ బ్రెయిలీ దినోత్సవం



ఓజిలి, జనవరి 4 ప్రభాతవార్త
ఓజిలిలోని భవిత కేంద్రంలో ప్రపంచ లూయిస్ బ్రెయిలీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ గొప్పతనాన్ని బ్రెయిలీలో ఎలా విద్యలో ముందుకు పోవాలో వివరించారు. లూయిస్ బ్రెయిలీ అంధత్వాన్ని జయించి అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన మహనీయుడని తెలియజేశారు. లూయిస్ కఠోరశ్రమకు, ఆదర్శజీవితాలకు వెలుగులు నింపారని ఆమె తెలియజేశారు. అనంతరం దివ్యాంగులైన విద్యార్థులకు వినికిడి పరికరాలు, రోలేటర్లను ఎంఇఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు స్వీట్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఓజిలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయులు కనిష్క, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ. కోటి విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

ఓజిలి, జనవరి 4, ప్రభాతవార్త



దాదాపు కోటి రూపాయిలు విలువ చేసే ప్రభుత్వం భూమిని రెవెన్యూ అధికారులు కాపాడారు. ఓజిలి మండలంలో రాజానగరంలో సర్వే నెంబర్ 73లో దాదాపు పది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కబ్జా దారుల నుంచి తహశీల్దార్ డి. లాజరస్ ఆదేశాల మేరకు వీఆర్ఓ నిరం జన్ ఆక్రమించిన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు విడిపించారు. ఇది ప్రభుత్వ భూమి ఈ భూమిపై ఇతరులు ఎవరైనా ప్రవేశించిన ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు పెడతామని తహశీల్దార్ డి. లాజరస్ హెచ్చరించారు.

# నగరిలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి



నగరి, జనవరి 4 (ప్రభాతవార్త):
నగరి–చిత్తూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి రోజా కి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పుత్తూరులో ఆర్టీవో కార్యాలయం ఉన్నందున ఎఫ్‌సీకి లైసెన్స్ తీసుకోవడానికి అనుకూలంగా ఉనిందని, కానీ జిల్లా విభజన జరిగిన తరువాత ఆర్టీవో కార్యాలయాన్ని చిత్తూరుకు మార్చడంతో నగరి, విజయపురం, నిండ్ర నుంచి వెళ్లాలంటే ఎక్కువ ఖర్చుతో శ్రమతో కూడుకున్న పని అని తెలిపారు. నగరి–చిత్తూరు బస్సు సౌకర్యం కూడా లేదని, నగరి నియోజకవర్గం పరిధిలోనే ఆర్టీవో కార్యాలయాన్ని తీసుకురావాలని మంత్రి రోజాని కోరారు. అదే ఒక విధంగా వేలాది మందికి ఉపయోగకరంగా ఆర్టీవో కార్యాలయాన్ని నగరిలో ఏర్పాటు చేసి ఆటో టాక్సీ పేదలను ఆదుకోవాలని కోరారు. మంత్రిమాట్లాడుతూ ఆర్టీవోకార్యాలయం అన్ని కూడా ఏర్పాటు చేస్తామని, నగరి నుంచి చిత్తూరుకు బస్సు ఏర్పాటు చేసే దానికి చర్యలు తీసు కుంటా మనిహామీఇచ్చారు. సీపీఐ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులుబాషా, శేఖర్, సత్తార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు

## రేపు గుడిమల్లం చూసొద్దాం రండి!

–భక్తులకు పర్యాటకశాఖ పిలుపు



తిరుపతి, జనవరి 4 (ప్రభాతవార్త):
ఆరుద్రనక్షత్రం సందర్భంగా రేణిగుంట మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయం సందర్శనకు తిరుపతి పర్యాటకశాఖ స్వాగతం పలుకుతుందని డివిజనల్ మేనేజర్ ఎం.గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆరుద్రనక్షత్రాన 2600 సంవత్సరాల క్రిందట ఆలయంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర్లు ఒకే శిలపై ఉన్నారు. లింగరూపంలో కాకుండా శివుడు మానవరూపంలో మహావీరుడై వేటగాడి వలె దర్శనమిస్తున్నాడు. ఈ ఆలయంలో సూర్యకిరణాలు ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయనంలో ఒకసారి ఈ ఆలయ రాతిగోడలపై గ్రిల్‌గుండా ప్రధాన శివలింగం నుదుటిన నేరుగా సోకుతాయి. ఈ ఒక్కరోజుయాత్ర 175 రూపాయలు ఛార్జీగా నిర్ణయించారు. మరిన్నివివరాలకు0877–2289123, 9848007033నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## నల్లచట్టాలతో తిరోగమనంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన

.శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త



ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన రాజ్యాంగ వ్యవస్థను కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన భారతదేశం కీర్తింపబడుతుంటే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నల్ల చట్టాలతో దోస్తీ చేస్తూ తిరోగమన దిశలో ఉందని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. ఈసందర్భంగా పలువురు తెదేపా నాయకులు మాట్లాడుతూ జగన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలుకు, దోపిడికి తట్టుకోలేక ప్రజలంతా సంఘటితమై జగన్‌కు వ్యతిరేఖంగా చంద్రబాబునాయుడు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ లక్షలాదిగా వీధుల్లోకి రావడాన్ని చూసి జీర్ణించుకోలేక నల్లచట్టాల ద్వారా పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడాన్ని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని నిరంకుశపాలన, నిర్భంత పాలన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే జరుగుతోందన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించిన పోలీసు వ్యవస్థ అందుకు విరుద్ధంగా అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలకు ఒకరకంగా ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మరియు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించుకునే సభలకు లేనిపోని నిబంధనలతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారమనేది శాశ్వతంగా ఒక్కరి దగ్గరే ఉండిపోదనే విషయాన్ని జగన్‌రెడ్డికి తెలియజేసే రోజులు దగ్గరలోనే ఉందని తెలుగుదేశంపార్టీ నాయకులు హెచ్చరిస్తూ బ్రిటీష్ పాలకుల నాటి 1861 పోలీసు చట్టాన్ని అనుసరించి సెక్షన్ 30ను దుర్వినియోగపరచేలా ప్రజల గొంతునొక్కడానికి జారీ చేసిన జీవో సంఖ్య 1ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్‌జిలానీ, కిషోర్, మునిరాజుయాదవ్, ఉమేష్‌రావు, భాస్కర్, మణి, సుబ్రమణ్యంనాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినులకు సావిత్రిబాయిపూలే అవార్డులు

తొట్టంబేడు, జనవరి 4 ప్రభాతవార్త



యుటిఎఫ్ తిరుపతి జిల్లా స్థాయి సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుల ప్రధాన కార్యక్రమం సూళ్ళూరుపేటలోనిర్వహించారు ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం నుంచి పిఆర్.వరలక్ష్మి, ఎ.దుర్గా దేవి, పి.షహనాజ్, పి.పుష్ప, కె.జయశ్రీ, బి.దాక్షాయ నమ్మ, దిమేరీ వాసవిలత, వి.ఈశ్వరిలును దుశ్శాలువతో సత్కరించి సావిత్రిబాయిపూలే మెమొంటోను, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. అంతేకాకుండా తెలంగాణా గవర్నర్ తమిళసై చేతులమీదుగా టి.చెంచుప్రసన్న ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయినులను యుటిఫ్ శ్రీకాళహస్తి మండలశాఖ, పలువురు నాయకులు అభినందించారు.

## తొట్టంబేడు ఎంఈవోపై డివైఈవో విచారణ

తొట్టంబేడు, జనవరి 4 ప్రభాతవార్త



తొట్టంబేడు మండల విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమాచారం అందుకున్న పుత్తూరు డివిజన్ డివైఈవో రఘురామయ్య బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈసంధ్భంగా డివైఇఓ ఎంఈవో భారతీతో పలు అంశాలపై చర్చించడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఇటీవల మండలంలోని పెద్దగుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మద్యం సేవిస్తూ వస్తున్న ఉపాధ్యాయుడుపై ఆరాతీశారు. ఆయనకు ఎందుకు జీతాలు చెల్లిస్తున్నారని, చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎంఈవో భారతీని ప్రశ్నించారు. పెద్దకన్నలి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గత ఏడాది జూలైలో యాక్సిడెంట్‌కావడంతో సెలవులో ఉన్నారు. అయితే సెలవులో ఉన్నా వేతనాలు చెల్లించడంపై పిర్యాదు అందడంతో ఎంఈవోను ప్రశ్నించారు. ఇక మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్ళడం లేదని పిర్యాదులు అందాయన్న సమాచారం. ఇక కార్యాలయ అటెండర్ రామయ్యను కూడా విచారించారు. అయితే దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదికను డిఈవోకు అందించనున్నట్లు డివైఈవోతెలిపారు. ఏది ఏమైనా మండలంలో విద్యావ్యవస్థ గాడితప్పిందని చెప్పవచ్చును. ఇకనైనా విద్యావ్యవస్థను అధికారులు గాడిలోపెట్టాల్సిన అవసరం ఉంది.

## ప్రజాస్వామ్యానికి వైకాపా తిలోదకాలు

– చీకటి జీవోలను రద్దు చేయాలని టిడిపి ధర్నా

తిరుపతిరూరల్, జనవరి 4 (ప్రభాతవార్త):



ప్రజాస్వామ్యానికి రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు పలుకుతుం దని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం తిరుపతిరూరల్ చెర్లోపల్లి కూడలి వద్ద టిడిపి శ్రేణులు భైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సభలకు ప్రజలు వస్తున్న జన ప్రభంజనాన్ని చూసి, సి.యం.జగన్ ఓర్వలేకనే సభలు, సమావేశాలు నిర్వ హించకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. బ్రిటీష్ కాలం నాటి జీవోలను ఇప్పుడు అమల్లోకి తేవడం ఏంటని ప్రశ్నించారు. జగన్ పాలన ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీని తలపెట్టిందని వాపోయారు. ఇలాంటి పాలన ఏ రాష్ట్రంలో జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. దేశంలో ఇటువంటి పాలన ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న రోడ్ షోలకు వచ్చిన ప్రజలు మృతి చెందడం వైకాపా పాలన తప్పిదమని పేర్కొన్నారు. చీకటి జీవో నెంబర్–1ను వెంటనే రద్దు చేయాలని, కుప్పంలో చంద్రబాబు పర్యటన విజయవంతంగా సాగాలని డిమాండ్ చేసారు. టిడిపి శ్రేణులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి సుధాకర్, శ్రీధర్‌నాయుడు, బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉసిరిపాటి శ్రీనివాసులు, మధు, విప్పర్ల లోకేష్‌నాయుడు, మునిశేఖర్, పెద్దఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## పేద ప్రజలసంక్షేమమే సిఎం జగనన్న ధ్యేయం

కుప్పంరూరల్, జనవరి 4 ప్రభాతవార్త

రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే సిఎం జగనన్న ధ్యేయమని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛను కానుక వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలో కొత్తగా మంజూరైన 148పెన్షన్లను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల నగదును పెంచుతూ నేడు రూ 2750లు అందిస్తున్నారన్నారు. నవరత్నాలు పథకాలతో ప్రతి ఇంటికి ఏదో ఓ లబ్ధి కలిగిస్తున్న ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలు కూడా వైకాపా ప్రభుత్వాన్ని మరింత ఆదరించాలని కోరారు. అంతకుముందు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమీషనర్ రవిరెడ్డి, రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..తెదేపా

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త

అరాచక ప్రభుత్వానికి వైకాపా రోజులు దగ్గరపడ్డాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 25వ వార్డులో నిర్వహించారు. ఈసందర్భంగా విజయకుమార్ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి వారికి పలకరిస్తూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, విద్యుత్తు బిల్లులు, ఇసుక, ఇంటి పనులు, మహిళలకు భద్రత తదితర విషయాలపై ప్రజలనుఅడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో25వ వార్డు ఇన్‌ఛార్జులు అద్దంకి డాంగే, అద్దం కిహేమంత్, మాజీ దేవస్థానం బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, తెదేపా సీనియర్‌నాయకులు బిజె.ప్రసాద్, శ్యాము మరియు తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, దశరధాచారి, మునిరాజనాయుడు, షాకిరాలీ, రెడ్డివారిగురవారెడ్డి, ఆర్ముగం, ప్రకాష్‌నాయుడు, జిలానీబాష, కెవి ప్రతాప్, ఉమేష్‌రావు, రేణుకమ్మ, సుమతమ్మ, చక్రాల.ఉష, శ్రీలక్ష్మి, సుబ్రమణ్యం, మణి, యాదగిరి, మోహన్, దిలీప్, వినయ్, అస్మత్, హేమంత్, కాసంరమేష్, కిషోర్, మిన్నల్‌రవి, పురుషోత్తంనాయుడు, నెమళ్ళూరుసుబ్రమణ్యం, పోలూరుశ్రీనివాసులు రెడ్డి, దొరబాబు, బషీర్, గోవిందు, ఖాదర్‌బాషా, డివినారాయణ, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్దే అజెండాగా ....రామానుజపల్లి గ్రామసభ

తిరుపతిరూరల్, జనవరి 4 (ప్రభాతవార్త):



రామానుజపల్లి గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివద్ది చేయడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ పొట్టేలు లీలారాణి తెలిపారు. తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లిలో సర్పంచ్ లీలారాణి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈసభలోసర్పంచ్‌లీలారాణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సభలు, సమావేశాలు నిర్వహించటానికి స్థల సేకరణకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సచివాలయం ఉన్న ప్రదేశంలో సమావేశమందిరాన్నినిర్మించాలని తీర్మానించారు. ఈసభలో గ్రామ కార్యధర్శి మదుసూధన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మెరుగైన జీవనవిధానానికి సౌకర్యాలు కల్పించడమే పంచాయతీ లక్ష్యమని తెలిపారు. ఈగ్రామసభలోహౌసింగ్ ఏఇ శ్రీరాములురెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, వైకాపా నాయకులు పొట్టేలు రవికుమార్, గ్రామవార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతు నొక్కడానికి వైసీపీ తీసుకొచ్చిన జీవో ఆర్‌టీ నెం.1

నగరి, జనవరి 4 (ప్రభాతవార్త):
వాక్ స్వాతంత్ర్యం, శాంతియుతంగా సమావేశాలు నిర్వహణ చేసుకునే హక్కు భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ద్వారా కల్పించింది. జగన్మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగను వ్యతిరేకంగా జీవో ఆర్‌టీ–01 జారీ చేసి ప్రజల గొంతు నొక్కుతున్నారని నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు విమర్శించారు. కుప్పంలోమాజీముఖ్యమంత్రి, జాతీయతెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నగరి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవోను రద్దు చేయండి - సీపీఎం డిమాండ్

కేవీబీ పురం, జనవరి 4 (ప్రభాతవార్త):



రోడ్లపైన సభలు, ర్యాలీలు, ఆందోళనలు, చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన జీవోను రద్దుచేయాలని సీపీఎం పార్టీ కేవీబీ పురం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం నాడు రాజులకండ్రిగ ప్రధాన రహదారిపై సీపీఎం పార్టీఆధ్వర్యంలోనిరసనకార్యక్రమంచేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల హక్కులను, రాజకీయ పార్టీల హక్కులను, కాలరాస్తూ ప్రజాస్వామ్య దేశంలో మానవ హక్కుల ఉల్లంఘనకుపాల్పడుతున్నారనివిమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులకు పింఛను అందాల్సిందే : మంత్రి రోజా

విజయపురం, జనవరి 4 (ప్రభాతవార్త) :



అర్హత వున్న ప్రతి ఒక్కరికి పింఛను అందాల్సిందేనని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. బుధవారం విజయపురం ఎంపిడిఓ కార్యాలయంలో పెంచిన పింఛను మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛను కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నపుడు జన్మభూమి కమిటీ ఒప్పుకుంటనే పింఛను తదితర సంక్షేమ పథకాలు వచ్చేవని, అర్హులైన వారు కూడా ఆ కమిటీ చుట్టూ తిరగలేక నానా బాధలు పడేవారని తెలిపారు. ఇపుడు వాలంటీర్లు ఇంటికే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందించిన ఘనత దేశంలో వైసిపి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జమున, ఎంపిడిఓ సతీష్, తహశీల్దారు అమరేంద్రబా బు, పలువురు అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గుండేలిగుంట పంచాయతీలో ఇసుకమాఫియాను అరికట్టండి

తొట్టంబేడు, జనవరి 4 ప్రభాతవార్త



గుండేలిగుంట పంచాయతీలో ఇసుకమాఫియాను అరికట్టాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో గుండేలిగుంట పంచాయతీలో నిర్వహించారు. పంచాయతీలోని పాఠశాల భవనాలు, ప్రహరీగోడ నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, ఉపాధిహామీ పథకం కింద తారురోడ్లు, సిసిరోడ్లు, పంచాయతీ భవన నిర్మాణంతో పాటు ఇసుకరీచ్‌ను ఏర్పాటుచేసి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత టిడిపిదే అన్నారు. ప్రస్తుత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుకమాఫియా యదేచ్ఛగా పంచాయతీ అధికారుల కనుసన్నల్లో జరుగుతుందని అధికారులే రాజకీయ నాయకులు అవతారమెత్తారన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు అధికార ప్రతినిధి రాఘవులుయాదవ్, తొండు గున్నయ్య, ఎస్సీసెల్ నాయకఉలు సాలిరాజా, బాలగున్నయ్య, సురేష్, క్రిష్ణయ్య, యువనాయకులు సుబ్రమణ్యం, కాటయ్య, వెంకటసుబ్బయ్య, లోకేష్, గురవయ్య, మస్తాన్, గంగారామయ్య, సాయి, వెంకటయ్య, హరికృష్ణ, భాగ్యలక్ష్మి, లక్ష్మమ్మ, ప్రభావతి, వీరమ్మ, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్దిశూన్యం: ఆగడాలు అధికం

ఇదేం ఖర్మలో నాయకులు

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 4 ప్రభాతవార్త



'ఒక్క ఛాన్సు కోరి ముఖ్యమంత్రి సీటు అధిరోహించిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారని తెలుగుదేశం నాయకులు శివమెత్తారు. ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీల్లో 'ఇదేం ఖర్మ' అనే కార్యక్రమాలను నిర్వహించారు. క్లస్టర్ ఇంచార్జి నాగరాజు నాయుడు సారధ్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైకాపాకు తెలుగుదేశం ఫోబియా పట్టుకుందన్నారు. తెలుగుదేశం నాయకులను సభలు, రోడ్‌షోలు చేయనిస్తే ఓడిపోతామనే భయంతో రక రకాల ఆంక్షలు విధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చేది గోరంతా దానికి పబ్లిసిటి కొండంత చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో పేరం ధనంజయులు నాయుడు, బాలాజి నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి సీతాపతి, వికృతమాల మాజీ సర్పంచ్ హేమాక్షి, సుబ్రమణ్యం, రవి, బాలాజి, సత్యం, రజని, మురళి, యుగంధర్, రాజశేఖర్, నాని, గిరి, నీలాంబరి, సీతారామయ్యలు పాల్గొన్నారు.

## శివయ్య రాబడి రూ.1.8కోట్లు

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు ఇఒ విసాగర్‌బాబు పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజులకు సుమారు రూ.1.8కోటి పైగా ఆదాయం వచ్చింది. ఈ లెక్కింపుల్లోసహాయ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు

## జగనన్న నవరత్నాలపై ప్రజలు సంతృప్తి..ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, జనవరి 4 ప్రభాతవార్త



జగనన్న నవరత్నాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవరం లేదని ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. బుధవారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చియ్యవరం సచివాలయ పరిధిలోని చియ్యవరం కొత్తఇండ్లు, దళితవాడల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్తులు ఎంఎల్ఏకు బ్రహ్మరధం పట్టి పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, తంగేళ్ళపాళెం సింగిల్‌విండో ఛైర్మన్ మోహన్‌కిషోర్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి వేమాలయ్య, సచివాలయ కన్వీనర్ రఘురామయ్య, సురేఖ, గంగాధర్‌ఎడ్డి, అలంకారయ్య, పెంచలయ్య, ముని, కోటి, శ్రీను, వెంకటేష్, చంద్రయ్య, పెంచలయ్య, దేవేంద్ర, వెంకటేష్‌నాయుడు, రమణయ్య, మునిరత్నం, భక్తవత్సలం, గరటారెడ్డి, డిల్లీబాబు, భాస్కర్, గంగాధరం, మణి, రాజేంద్ర, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, డిప్యుటీతహశీల్దార్‌సుధీర్‌రెడ్డి, మండలాధికారులు, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నా రు.

## చక్రేశ్వరస్వామి ఆలయ ఆధునికీకరణ పనులకు భూమిపూజ

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంద ఆలయమైన చక్రేశ్వరస్వామి దేవాలయం ఆధునికీకరణ పనులకు బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయంకు విశేషసంఖ్యలో భక్తులు వస్తుంటారని ఆలయానికి ముఖద్వారంలో నూతనంగా ఆర్చి మరియు దేవస్థానంలో ఇప్పటి వరకు నందీశ్వరున్ని ఏర్పాటు చేయలేదని నూతనంగా నందీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఈ శ్రీనివాసులురెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, పాలకమండలి సభ్యులు రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణిపాండు, వైకాపా నాయకులు స్వర్ణమూర్తి, పగడాలరాజు, సెన్నీరుకుప్పంశేఖర్, మొగరాలగణేష్, గణేష్, పత్తిమణి, ఆలయాధికారులు, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్



## ర్యాలీలు నియంత్రించే జిఒ రద్దు చేయాలి

పుత్తూరు, జనవరి 4 (ప్రభాతవార్త) :
రాష్ట్రంలో రోడ్ షోలు, ర్యాలీలు నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, సిపిఐ పట్టణ కార్యదర్శి డి.మహేష్, సిపిఎం నాయకులు సుబ్రమణ్యంలు ప్రభుత్వం జారీ చేసిన జిఒ కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న పౌర హక్కులను అణిచివేసేలా పోలీసులకు సర్వాధికారులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదమని తెలిపారు. వెంటనే జిఒను రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు గోపి, కృష్ణారెడ్డి, రమేష్, రవి, మణి, సెల్వరాజ్ ఆచ్చారి, సిపిఎం నాయకులు పురుషోత్తం, బాషా, భాస్కర్, రమేష్, ధన, టిడిపి నాయకులు ఇ.బలాజీ, ఎన్.ఎన్.ధనపాల్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నవీన్, హరి తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 4, ప్రభాతవార్త



తిరుపతి నగరంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గించి, ప్రజల సమయాన్ని ఆదా చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. నగరంలో 13 ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో బుధవారం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి అక్కారంపల్లి, తిమ్మినాయుడు పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కోసం నగరపాలక సంస్థ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ పనులుశరవేగంగాచేయిస్తున్నారన్నారు. ఇదే వేగంతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ సంజయ్ కుమార్, ఏసిపి బాలసుబ్రమణ్యం, టిపిబిఓ ధర్మరాజు ఉన్నారు.

## పంచాయతీలో పారిశుధ్య పనులు

పుత్తూరురూరల్, జనవరి 4 (ప్రభాతవార్త):
పుత్తూరు మండలంలోని వేపగుంట, నేసనూరు గ్రామాల్లో సర్పంచ్‌లు గోవిందస్వామిరెడ్డి, గిరిజా ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీల్లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. ఇళ్ళ పరిసర ప్రాంతాల్లోని చెత్తాచదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుజాత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

పుత్తూరురూరల్, జనవరి 4 (ప్రభాతవార్త):



పుత్తూరు మండలం భవిత పాఠశాలలో ప్రంచ బ్రెయిలీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు పాల్గొని పుత్తూరు ఎంపీపీఎస్ భవానీనగర్ పాఠశాలలో పని చేస్తున్న అంధ ఉపాధ్యాయుడు ఎన్.సుందరంని ఘనంగా సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ సుందరం అంధ ఉపాధ్యాయుడిగా 2016లో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం 2021లో ఎంపీపీఎస్ భవానీనగర్‌లో ఉపాధ్యాయుడిగా చేరి విద్యార్థులకు సేవలు అందిస్తున్నాడు. ఆయన తోటి ఉపాధ్యాయులతో కలసి మెలసి అందరి మన్ననలను పొందుతున్నాడు. సుందరం మాట్లాడుతూ నేను పుట్టుకతోనే అంధునిగా జన్మించాను. నా చదువు ఏ విధంగా కొనసాగుతోందనని నా తండ్రి బాధపడుతున్న సమయంలో నా తండ్రి మిత్రుడు సహాయంతో తిరుపతిలోని నవజీవన్ అంధుల పాఠశాలలో చేరి నా విద్యాభ్యాసం కొనసాగించానన్నారు. టీచర్ ట్రైనింగ్ రాయచోటిలో చేరి(డీఐఈటీ) పూర్తి చేశానని, 2015లో ఉపాధ్యాయుడిగా చేరి నా కుటుంబాన్ని ఎవరి సహాయం లేకుండా పోషిస్తున్నానని తెలిపారు. భవిత ఉపాధ్యాయుడు ఆనంద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో వైసిపికి అభ్యర్థులు దొరకరు

పుసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ జోస్యం

తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 4 (ప్రభాతవార్త):



గత మూడున్నరేళ్లుగా వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావని, వీరు ఇలాగే చేస్తే రానున్న 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో ఆ పార్టీ తరపున పోటీ చేయడానికి పూర్తి స్థాయిలో అభ్యర్థులే దొరకరని జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ డా॥పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్‌లు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు జనసైనికులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, సుమన్‌బాబు, ఆనంద్, మనోజ్, బాటసారి, షరీఫ్, హేమంత్, గోపిస్వామి, రాంబాబు, మనోజ్‌కుమార్‌లతో కలిసి ఈనెల 12వ తేదీ శ్రీకాకుళం జిల్లా రణస్థలం నందు జరగబోవు "యువశక్తి" భారీ బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం డా॥హరిప్రసాద్, కిరణ్‌రాయల్‌లు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని యువత అంధకారంలో మగ్గుతోందన్నారు. తమ అధినేత "వారాహి" వాహనం రిజిస్ట్రేషన్ చేయించిన రోజే వైసిపిలో వణుకు మొదలైంద న్నారు.

## యూనివర్సిటీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 పెంచాలి

సిఐటియు మహాసభలో గండికోట నాగ వెంకటేష్ డిమాండ్

తిరుపతి క్రీడ, జనవరి 4, ప్రభాతవార్త
సిఐటియు రాష్ట్ర మహాసభలు భీమవరం పట్టణంలో జనవరి 2 నుంచి 4 వరకు జరుగుతున్నాయి. ఈ మహాసభల్లో ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా, తిరుపతి జిల్లాలోని యూనివర్సిటీలో పని చేసినటువంటి ఉద్యోగులు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పదవి విరమణ వయస్సు 62 పెంచాలి సిఐటియు రాష్ట్ర మహాసభలో గండికోట నాగవెంకటేష్ డిమాండ్ చేశారు. అదే విధంగా సిపిఎస్ విధానం రద్దు చేసి, ఓపిఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులని రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం అమలు చేయాలని ఈ మహాసభలో తీర్మానాలు చేశామన్నారు.

## చదలవాడ డెంటల్ కాలేజ్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు

తిరుపతి (విద్య), జనవరి 4, ప్రభాతవార్త
తిరుపతి రేణిగుంట రోడ్డులోని సికెఎస్ తేజ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ కాలేజీ ఆవరణంలో కొత్తగా బిడిఎస్ కోర్సులో చేరిన విద్యార్థి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కోర్సు యొక్క ధోరణి, విలువలు, సేవాభాగ్యమువాటివిలువలుగురించి అవగాహన సదుస్స నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా పూర్వ ప్రిన్సిపాల్ అనుభవజ్ఞులైన డాక్టర్ ప్రభాకర్ రావు, సివిఎస్ కృష్ణమూర్తి తేజా చారిటీ, ఫౌండర్ ఛైర్మన్ డా. చదలవాడ కృష్ణమూర్తి, చారిటీస్ ట్రస్టీస్ కవిత, సుమలత, బిడిఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్‌డాక్టర్‌రవీంద్రనాథ్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్‌చంద్రశేఖర్‌రావు, ఇతరహెచ్ఒడిలు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## సంక్షేమంలో జగనన్న దేశానికే ఆదర్శం

తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, జనవరి 4 (ప్రభాతవార్త):
సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి యావత్ దేశానికే ఆదర్శమని తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ కొనియాడారు. స్థానిక పాత మండల పరిషత్ ఆవరణలో పెరిగిన పింఛన్ మొత్తాన్ని ఆయన బుధవారం లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.2750/–లకు పింఛన్ మొత్తం పెరగడం పట్ల వయోవృద్దులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నిజమైన లబ్దిదాలను గుర్తించి, అర్హత ఆధారంగా ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ శానంబట్ల సురేష్ రెడ్డి, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కోటాల చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి దక్షిణ మండల అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఎంపిటిసిలు రాజులగారి సుజాత, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, చేగు గోవర్ధన్ గుప్తా, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లోక కల్యాణార్ధం గాయత్రి మహామంత్ర జపయజ్ఞం

చంద్రగిరి, జనవరి 4 (ప్రభాతవార్త):
ప్రాణాంతక మహమ్మారి కరోనా వంటి రోగాలబారిన పడకుండా ప్రజలను రక్షించేందుకై లోక కల్యాణార్ధం గాయత్రి మహామంత్ర జపయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొండవాడ ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి ఆలయ సమీంలోని నారాయణీ గార్డెన్స్ నందు బుధవారం శ్రీమహాలక్ష్మి మహా సుదర్శన హోమ సహిత శతకోటి గాయత్రి మహా మంత్ర జపయజ్ఞం 24 హోమగుండాలలో శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన ఈ మ హా య జ్ఞం శ్రీ రా వ ు చ ం ద్ర మ ూ ర్తి దంపతుల చేతుల మీ ం ద ు గ ా ప్రారంభించారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, RACHARLA JAGADEESH (Old name) with passport number M 4789508, S/o RECHARLA VISWANA DHAM NAIDU, residing at 11-77, Krishnapuram Post and village, Mogarala, Damalachruvu, Pakala Mandal, Tirupati Dist, Andhra Pradesh - 517152, changed my name from RACHARLA JAGA DEESH to RECHARLA JAGA DEESH vide affidavit dated 08.11.2021, sworn before Notary Duddela Balakrishna. At Tirupati, Andhra Pradesh. Henceforth, I shall be know as RECHARLA JAGA DEESH for all purposes.

(Ro.No.46300)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైనసంబంధం లేదు.

# మేనిఫెస్టో కాకుండా అదనంగా పథకాలు:ఎమ్మెల్యే

వాకాడు, జనవరి 4, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టో ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, పేద బడుగు బలహీన వార్గల ప్రజలకు అదనంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి కార్యక్రమాలు చేస్తున్నారన్ని గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. బుధవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణం లోని స్త్రీ శక్తి భవనంలో కొత్తగా మంజూరైన పింఛన్ పంపిణీ కార్యక్ర మానికి ముఖ్య అతిధిగా విచ్చేచారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ఇంటి యజమాని చనిపోతే అతను భార్యకి పింఛన్ వచ్చేదని మిగిలిన అర్హులందరికీ వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి వృద్ధులకు చెప్పిన విధంగా పింఛన్ మంజూరు చేసి ఇంటి వద్దకే పంపిణీ జరుగుతుం దన్నారు. వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులకు సిగ్గుందా అంటూ పేదలకు అన్యాయం జరగకూడదు అన్న సంకల్ప


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు

ంతో సోషల్ ఆడిట్ నివేదికలో ప్రకారం విచారణ జరుపుతుంటే పచ్చ కండువాలు కప్పుకొని అర్థంలేని విమర్శలు చేయడం ఎంత వరకు న్యాయ మని టిడిపి నాయకులను ఆయన విమర్శించారు. జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నకు ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.ఏఎంసి ఛైర్‌పర్సన్ నాగభూషణం, సర్పంచు ల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయ్ భాస్కర్ రెడ్డి, ఎంపిడిఓ గోపినాథ్, ఎస్ఐ రఘునాథ్, ఎంఈఓ బాబు, హౌసింగ్ ఏఈ వెంక టేశ్వర్లు, సర్పంచులు అనిల్ కుమార్ రెడ్డి, బండి వెంకటరత్నమ్మ, సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, నాగరాజు, కిషోర్ కుమార్, విజయ్ రెడ్డి, ఉప సర్పంచులు వెంకటరత్నం, బందిలి రవి, నాయకులు, కార్యకర్తలు పింఛనుదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**

సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడు తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూకాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు చేరువ య్యాయా లేదా అన్న అంశంపై స్వయంగా తెలుసుకునేందుకే జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి శ్రీకారంచుట్టార న్నారు. అందులో భాగంగానే లబ్ధిదారులకు సంక్షేమ పథకాల వివరాలను అందజేసి వాటిలోని



లోటుపాట్లు తెలుసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం పింఛన్లు తొలగించినట్లు ప్రచారాలు అపోహలు మాత్రమే అన్నారు. ఈ కార్యక్ర మంలో ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు గోగుల తిరుపాల్, కృష్ణ బలిజ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

# న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

తిరుపతి (విద్య), జనవరి 4 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బుధవారం న్యాక్ ఏ గ్రేడ్‌ను సాధించింది. ఎస్ఎస్ఆర్, డివివి యొక్క సమర్పణ ప్రక్రియ, పీర్ బృందం సందర్శన గత కొన్ని నెలల నుండి కొనసాగుతోంది. నాణ్యత సంబంధిత పారామితులను అంచనా వేయడానికి న్యాక్ పీర్ బృందం డిసెంబర్ 27వ తేది నుండి 29వ తేది 2022 వరకు సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. జమున మాట్లాడుతూ యూనివర్సిటీని న్యాక్ ఏ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌కి ఎలివేట్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది పాఠ్యాంశ సంస్కరణలు, పరిశోధన, ఆవిష్కరణలు, పొడిగింపు, ఉత్తమ అభ్యాసాలు, సంస్థాగత విశిష్టతలలో విభిన్నమైన సంస్థగా ఉద్భవించింది. స్వీయ అధ్యయన నివేదికను న్యాక్‌కి సమర్పించడానికి, మొత్తం పీర్ బృందం సందర్శనను చూసేందుకు గత కొన్ని నెలలుగా అవిశ్రాంతంగా పని చేసిన ఐక్యూఏసి బృందానికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐక్యూఏసి డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమా మహేశ్వరి, ఐక్యూఏసి సంస్థకు న్యాక్ ఎ గ్రేడ్‌ని సాధించేందుకు కృషి చేసినందుకు ఐక్యూఏసి డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఉష, ప్రొఫెసర్ బిఎన్ నీలిమలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ విశ్వవిద్యాలయం శ్రేష్ఠత, విశిష్టత కలిగిన సంస్థగా ఆవిర్భవించి రాబోయే రోజుల్లో దేశంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందని ఆశించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డిఎం మమత, ఏ గ్రేడ్ సాధించడం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేసారు.

# పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి పించన్లు :ఆర్‌కె రోజా

నింద్ర, జనవరి 4 ప్రభాతవార్త : కులాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పించన్లు పంపిణి చేస్తున్నట్లుగా రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని సియల్ఆర్‌సి భవనంలో 159 మంది కొత్తగా మంజూరైన వారికి రాష్ట్ర పర్యాటకశాఖామంత్రివర్యులు ఆర్‌కె రోజా చేతుల మీదగా పంపిణి చేసారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రూపంలో సహాయం అందజేస్తున్నారని తెలిపారు.గతంలో రాష్ట్రంలో పరిపాలన చేసిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శించారు. రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పాడి మూడు



సంవత్సరాలలో వైకాపా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దనాలలో 98శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు,యంపిపి దీపాజలంధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్, యంపిటిసి విజేష్,నింద్ర సర్పంచ్‌లు వసంత్‌బాబురెడ్డి,గౌరి,నాయకులు మేరీజయరామ్, మహేష్, గిరి, తోయజాక్షి, వీరయ్యానాయుడు,సంపత్‌కుమార్,నామాదేవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ సైకిల్ యాత్ర



చంద్రగిరి, జనవరి 4 ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ తన సైకిల్ యాత్ర మారోమారు పూర్తి చేసుకుని బుధవారం తిరుగు ప్రయాణమ య్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా, కినత్తుకడవు, సింగరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్ (60) తిరుమల శ్రీవారి దర్శనార్థం సైకిల్‌పై వచ్చారు. ముందుగా తిరుచానూరులోని శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేశారు. వేకువజామున తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్ళి స్వామి వారిని దర్శించుకుని తిరిగి రాత్రికి తిరుచానూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఏటా సైకిల్‌పై దాదాపు నాలుగు వందల కిలోమీటర్లుకు పైగా ప్రయాణించి స్వామి వారిని దర్శించుకుని తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. ఆరు పదుల వయస్సులో ప్రయాణం కష్టం కదా అని ప్రశ్నిస్తే పెరుమాళ్ పట్ల తనకున్న భక్తి ఆ కష్టాన్ని దూరం చేస్తున్నట్లు తెలిపారు.

## గంగుండ్ర మండపంలో... కోదండరామస్వామి ఉత్సవమూర్తులు

తిరుపతి,జనవరి 4ప్రభాతవార్త: వైకుంఠద్వాదశి మరుసటిరోజు తిరుపతిలోని కోదండరామస్వామి ఉత్సవమూర్తులు శ్రీసీతారామ లక్ష్మణులు బుధవారం సాయంత్రం గంగుండ్రమండపం వేంచేపు చేశారు. ఆలయం వద్ద నుంచి మంగళ వాయిద్యాలతో ఉత్సవ మూర్తులను ఇక్కడకు తీసుకురావడం ఆనవాయితీ. సాయంత్రం ప్రత్యేక పూజలు, నివేదనలు సమర్పించిన అనంతరం ఊరేగింపుగా ఆలయంలోనికి చేర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఆనందకుమార్‌దీక్షితులు,ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.



## శివయ్య సేవలో అనసూయ పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త : బుధవారం శ్రీకాళహస్తిలోని నెహ్రూవీధిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ వస్త్రాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన యాంకర్ సినినటి అనసూయ భరద్వాజ్ శ్రీకాళహస్తీ శ్వరుని సేవలో పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహి ంచే రాహుకేతుదోష నివారణ పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేసారు.దర్శనం తరువాత మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఓ వికె సాగర్‌బాబు అందించారు.

**అనసూయ రాకతో ట్రాఫిక్ చిక్కుల్లో ప్రజలు :**

సినీనటి, బుల్లితెర జబర్దస్త్ యాంకర్ అనసూయ పట్టణంలోని నెహ్రూవీధిలో కొత్తగా నిర్మించిన బాలాజీషాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. తొలుత ఆమె శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకున్నారు. అనంతరం నెహ్రూవీధిలో ఉన్న బాలాజీషాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు.దీంతో పోలీసులు ఓవర్‌యాక్షన్ చేయడం ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ఉదయం 9గంటల నుంచే వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నుంచి ఎవ్వరిని అనుమతించకపోవడంతో పాటు పెండ్లిమండపం, నెహ్రూవీధి, నగరివీధుల్లో ట్రాఫిక్‌స్తంభించింది. నూతన షాపింగ్‌మాల్ వద్ద జనం చేరుకోవడంతో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కనీసం ఈమార్గంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి కనిపించింది. ఇక ఈమార్గంలో ఆస్పత్రులు కూడా ఉన్నాయి. సుమారు 11గంటల వరకు ఎవ్వరిని అనుమతించకపోవడంతో పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు మాత్రం చోద్యం చూస్తుండడం పలువిమర్శలుకు దారితీస్తోంది.

## వైసీపీ పార్టీ మారే ప్రసక్తే లేదు

**- ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర**

వెంకటగిరి, జనవరి 4, ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మారే ప్రసక్తే లేదని శ్రీ వెంకటే శ్వర భక్తి ఛానల్ ఛైర్మన్ డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. వైసీపీ నియోజకవర్గ సమ న్వయకర్తగా నియమితులైన సందర్భంగా నేదురు మల్లి రాంకుమార్‌రెడ్డి సాయికృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము పార్టీని మారుతామని



వస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైసీపీ పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో 35 సంవత్సరాలు పాటు ఉన్నామని, ఇక పార్టీలు మారాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ అధినేత సీఎం జగన్మోహన్‌రెడ్డికి విధేయులుగా పని చేస్తామని చెప్పారు. రాంకుమార్‌రెడ్డికి పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని చెప్పారు. ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చి కలిసినట్లు రాంకుమార్‌రెడ్డి తెలిపారు. రాజాలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, నాయకులు శంకర్‌రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును అడ్డుకోవడంపై టిడిపి నాయకుల ధర్నా

పుత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త :తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబునాయుడు కుప్పం పర్యట నను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరిం చి అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల గొంతు నొక్కేందుకు వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ నెంబరు 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. వాక్ స్వాతంత్ర్యం హక్కు కల్పించిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జిఓ జారీ చేశారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో నానాటికీ వ్యతిరేకత పెరగడాన్ని జీర్ణించుకోలేక ప్రశ్నించే గొంతులను అణిచివేయడానికి 163 సంవత్స రాల క్రితం నాటి చట్టాన్ని ముఖ్యమంత్రి ఇపుడు అమలు చేస్తున్నారని తెలిపారు. కుప్పం ప్రజలతో ఎన్నుకోబడిన స్థానిక ఎమ్మెల్యేగా తన నియోజకవర్గం ప్రజలను కలుసుకోవడానికి చంద్రబాబు ప్రత్యేక అనుమతులు తీసుకోవాలని చెప్పడం బట్టి ప్రభుత్వ నియంతృత్వ వైఖరి అర్థమవుతోందని అన్నారు. వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటనలకు అనుమతి తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, బిసి సెల్ చిత్తూర పార్లమెంట్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, నాయకులు యుగంధర్, ధనపాల్, బాలాజీ, కేశవాచ్చారి తదితరులు పాల్గొన్నారు.



## సంక్రాంతిలోగా ఉపాధ్యాయులకు తీపికబురు: పేర్నాటి



కోట, జనవరి 4 ప్రభాతవార్త : ప్రభుత్వ ఉపాధ్యా కులకు సంక్రాంతిలోగా ప్రభుత్వం తీపికబురు అందించనుందని తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైసీపీ ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. బుధవారం కోట మండలం కొత్తపాలెం సచివాలయం, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠ శాల, కొత్తపట్నం, సిద్ధవరం, పెద్దగోవిందపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొక్కుపాడు తదితర గ్రామాల్లో శ్యాంప్రసాద్‌రెడ్డి ఉపాధ్యాయులను కలుసుకొని తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఉపాధ్యా యులు ఎన్నోరోజులుగా ఎదురు చూస్తున్న డిఎలు సంక్రాంతి కానుకగా జగనన్న ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య కొంత గ్యాప్ ఉన్న మాట వాస్తవమేనని, ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సిలు ఇందుకు ముఖ్య కారణమన్నారు. చిన్న చిన్న సమస్యలను కూడా పెద్దవిగా చూపిస్తూ ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెంచుతున్నారని, సరైన మార్గంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీచెంగాళమ్మ హుండీ ఆదాయం 59 లక్షలు

సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త : సూళ్లూరు పేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానం లోని హుండీలను బుధవారం లెక్కించారు. ఈ హుండీల ద్వారా 59 లక్షల 10వేల 449 రూపా యలు ఆదాయంగా లభించింది. ఇందులో విదేశీ కరెన్సీ యుఎఇ ఇనామ్స్ 320, ఓమన్ పైసాలు ఉన్నాయి. ఈ ఆదాయం మొత్తం మూడు నెలల 23 రోజులకు చేకూరింది. ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాల చంద్రారెడ్డి పర్యవేక్షణలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీలత సమక్షంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు ఎన్.నాగమణి, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ట్రస్టుబోర్డు సభ్యురాలు ముంగర అమరావతి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి త్రోబాల్‌కి ఇద్దరు విద్యార్థులు ఎంపిక



చిల్లకూరు జనవరి 4 ప్రభాతవార్త : మండలంలోని పారిచర్లవారి పాళెం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుతున్న జి మహేంద్ర, ఇ.కీర్తనలు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14లో త్రోబాల్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికవడం సంతోషమన్నారు.అయితే ఈనెల 28,29,30 తేదిలలో కర్నూలు జిల్లాలోని నంద్యాలలో రాష్ట్ర స్థాయిలో త్రోబాల్ పోటీలలో పాల్గొనడం అక్కడ కూడా విజయ పథంలో దూసుకెళ్లాలని వారు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రవదన,కామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

### ఒక్క అవకాశం ఇవ్వండి...

# అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా

**-చంద్రగిరి టిడిపి ఇన్‌చార్జి పులివర్తి నాని**



తిరుపతిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త: చంద్రగిరి ఎమ్మె ల్యేగా గెలిపిస్తే... అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా నని చంద్రగిరి టిడిపి ఇన్‌చార్జి పులివర్తి నాని స్పష్టం చేసారు. 'ఇదేమి ఖర్మ-మన రాష్ట్రానికి' కార్యక్రమం అవి లాల, గాంధీపురం గ్రామ పంచాయతీలలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పులివర్తి నాని మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనకు అవకాశం ఇచ్చి, ఓ సారి గెలిపిస్తే చంద్రగిరి నియోజకవర్గం రూపురేఖలను మార్చేస్తానని తెలిపారు. అవిలాల, గాంధీపురం గ్రామ పంచాయతీలలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం టిడిపి హయంలో పాలన ఎలా ఉంది, అప్పట్లో అభివృద్ధి పనులు ఎలా జరిగాయి, నిత్యవసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు తదితర అంశాలపై ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వైకాపా ప్రభుత్వ పాలన అభివృద్ధి ఎలా ఉందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ చార్జీలు, కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు అమాంతంగా పెరిగి పేదలు మోయలేని విధంగా పెంచారని ప్రజలు వాపోతున్నట్లు నాని తెలిపారు. తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ పులివర్తి నాని గెలిపిస్తే నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానికి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. టిడిపి శ్రేణులు సాంబయ్య, హరి, ధనంజయరాయల్, ధనంజయ యాదవ్, శివ, వెంకటముని, రామరాజు, కలికమ్మ, కృష్ణయ్య, పురంధర్, హేమలత, సుబ్బరాజు, రమాప్రియ, అవిలాల, గాంధీపురం గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**- వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి**

వెంకటగిరి, జనవరి 4, ప్రభాతవార్త: వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూ నిటీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వైసీపీ నియోజకవర్గ సమన్వ యకర్తగా నియమించిన సందర్భంగా ఆయన వెంకటగిరికి వచ్చారు. వెంకటగిరిలో ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి తనపై ఉన్న నమ్మకంతో నియోజకవర్గ సమన్వయకర్తగా



ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు డెవలప్‌మెంట్ ఛైర్మన్ తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు కూడా ఇచ్చారని చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరగడంలేదని సీఎం జగన్మోహన్‌రెడ్డి తనను సమన్వయకర్తగా నియమించారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దొంతు శారద, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మేరిగ మురళీధర్, పార్టీ నాయకులు ఢిల్లీ బాబు, చెలికం శంకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## కాణిపాకం ఆలయానికి 1.34 కోట్లు ఆదాయం



కాణిపాకం, జనవరి 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా రికార్డు స్థాయిలో 1.34 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మో హన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా కేవలం 16 రోజులకు గాను హుండీల ద్వారా 1,33,83, 545 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 32 గ్రాముల బంగారు, 2 కిలోల 100 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 528 అమెరికా డాలర్లు, 40 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 30 యూఏఈ దినార్స్, 45 ఆస్ట్రేలియా డాలర్లు,10 కెనడా డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని,హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఉమేష్, రవి, యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన మేయర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ చాంబర్ నందు బుధవారం ఉదయం 27వ డివిజన్ సంబం ధించి పింఛన్లు అందజేసారు. 27వ డివిజన్ పరిధి లోని కొత్త పింఛన్లు మంజూరు అయిన వాటిని మేయర్ శిరీష లబ్ధిదారులకి పింఛన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛన్లు ఉదయం 5 గంటల నుండి గడపగడపకు పింఛన్లు పంపిణీ చేయడం జరుగు



తుందని తెలిపారు. వైఎస్ఆర్ పింఛన్ కానుక జనవరి నుంచి పెరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందించేందుకు నగర పాలక సంస్థ ఏర్పాట్లు పూర్తి చేసింది. పింఛన్ కింద 2,750 లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లే అందజేస్తున్నారన్నారు. 2022 జూలై నుంచి నవంబర్ మధ్య పింఛన్, రేషన్, ఆరోగ్య శ్రీ పథకాలు ఎంపికైన వారికి ఒకటవ తేది ఆదివారం నుంచి అందించడం జరిగిం దన్నారు. జనవరి ఒకటో తేది నుంచి ఏడవ తేది వరకు నగర పాలక పరిధిలో పెన్షన్ కానుక వారోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. ప్రతి నెల మొదటి రోజే, ఆది ఆదివారమైనా, సెలవు దినమైన లబ్ధిదారుల గడప ముందుకొచ్చి ఫించను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తులసి యాదవ్, చింత రమేష్, గీత యాదవ్, డివిజన్ కార్యదర్శి గోపాల్, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## లంచాల్లేవు రాజకీయ కక్షసాధింపుల్లేదు : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి రూరల్, జనవరి 4 ప్రభాతవార్త : ఎవరో చనిపోతే తప్ప మరొకరికి పెన్షన్ ఇచ్చే పరిస్థితి లేదు. జగనన్న వచ్చిన తరువాత నిరుపేదల పథకాలకు అత్యంత ప్రాధ్యాత ఇస్తు న్నారు. 'లంచాల్లేవు, రాజకీయ కక్ష సాధింపుల్లేదు, పార్టీల మాట లేదు. ఎవరైనా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి ప్రతి నెల 1వ తేది పెన్షనర్ల తలుపు తట్టి పెన్షన్లు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కిందని శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొత్త పెన్షన్ల పంపిణి వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ వచ్చారు. నేడు ప్రభుత్వం పేద ప్రజల కోసం పని చేస్తుందని ఎన్ని కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా నిరుపేదల పథకాల అమలులో వెనకడుగు వేసేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేసారన్నారు. ఈ సంబరాల్లో జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి, ఏర్పేడుజడ్పిటిసి తిరుమలయ్య, తొట్టం బేడు ఎంపిపి నిర్మలమ్మ, ఉన్నం వాసుదేవనాయుడు,చెంచయ్య,హరిబాబురాయల్, సిరాజ్‌బాషా, ఈశ్వరెడ్డి మండల నాయ కులు, అధికారులు,వాలంటీర్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఎంఇఓ, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఉమారెడ్డి పూజలు

శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ గుంటూరు ఎంఎల్‌సి ఉమారెడ్డి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలసి స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు.ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఘనస్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేదపండితులతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయ ఆలయం వద్ద వారికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, ఆలయ టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరాజు, సుదర్శనంలు పర్యవేక్షించారు.

## ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఘనస్వాగతం



కుప్పంరూరల్, జనవరి 4 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా తెదేపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి సాయంత్రం 3.55గంటలకు శాంతిపురం మండలం 121 పెద్దూరుకు చంద్రబాబు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జెబి కొత్తూరు క్రాస్‌లో భారీ గజమాలతో బాబును సత్కరించారు.